స్కెచ్

# "చిరంజీవి మానవుడి మృత్యువు"

కె. రామలక్ష్మి

రాత్రి అంతా నిద్రపోవడానికిబదులు, ఆ రైలు పెట్టెలో కింది సీటులో అతడు పడుకుని, చీకటి అలుముకున్న ఆకాశాన్ని చూస్తూ, రెప్ప వాల్చక చూస్తూ-గడిపాడు. చాలా సంవత్సరాలకి మొదటిసారిగా జ్ఞాపకంవచ్చి, ఆ రైలుబండిలాగే పరిగెత్తాయి అతని హృదయంలోని పూర్వ స్మృతులు - చిన్ననాటి కలలు - పాతకాలపు వ్యూహాలు... ఆ నిశీథాకాశంలో ఎక్కడెక్కడో చూశాడు; తన అంధకార హృదయంలోనికి దృష్టిసారించి చూశాడు... హృదయం విషాద పూరితం అయింది, గంటలూ, రోజులూ, సంవత్సరాలూ ఎన్ని వృథాగాపోయాయో! అనిపించింది. తనలో తనే ఎంతో బాధపడ్డాడు. వెచ్చని వేసవి దినాలూపోయాయి, మధురమైన వసంతవాయువులూ, ఆస్వాదించకుండానే పోయాయి... సంవత్సరాలకి సంవత్సరాలు పోయాయి. అవి దేనితో నిండినట్లు? ప్రతిధ్వనించే రోడ్లతోటీ స్థిమితంలేని మనుష్యులతోటీ, కంటికి ఇంపైనవి తప్ప యితరం అన్నీ చూసే కళ్ళతోటీ, పిచ్చెత్తించేటి ధ్వనులుతప్ప యింకన్నిటికీ ద్వారంమూసిన చెవులతోటీ, అన్ని సుఖానుభూతులకీ చచ్చిపోయి ఒక్క తాపత్రయానికీ, అర్థంలేని ఆరాటానికే బ్రతికున్న హృదయంతోటీ... వెనక్కి తిరిగి చూసుకుంటే అంతా అంధకారమే. జ్ఞప్తి తెచ్చుకుని ఆనందించడానికి ఒక్క అనుభూతికూడా లేదు. జీవితం అంతా, అంత ఎడారిగా గడిచిందా?...

...గంటల తరబడి...నిదానంగా చూశాడు ఆ నిశీథంలోకి... ఆత్రంగా దానిలో తనూ ఐక్యం అయిపోవాలన్న ఆరాటంతోటి. పచ్చని మైదానాలూ, మొరటుకొండలూ, ఏ సాంగత్యం లేని ఏకాంతాన్ని అనుభవిస్తూన్న నిద్రగన్నేరు చెట్లూ- అన్నీ త్వరితగతిని పరుగెడుతున్నాయి.

...అతను చూస్తూనే కలలు కనడం ప్రారంభించాడు. అతని హృదయం సిగ్గువిడిచి తనతోటే మాట్లాడుకుంటూంది... ఏడుసార్లు కళ్ళుమూసి తెరిచాడు...అదే మధ్యాహ్నం...అదే ప్రదేశం. ఇంకా ఇక్కడేవున్నానా అనుకున్నాడు. భూమిమీద ఇంకా సూర్యుడు ఉదయిస్తూనే వున్నాడు! ఏమిటో!యీ సూర్యోదయాస్తమయాలు ఎప్పుడు ఆగిపోతాయో, అప్పుడే మానవుడికి మనశ్శాంతి.

వాస్తవిక ప్రపంచంలోకి వచ్చినట్లు తెలిసింది ఆకలి దహించుకుపోడం మూలాన్ని...మనిషికి యీ ఆకలేమిటో! ఒక్క అన్నానికే కాకుండా అన్నిటికీ యీ ఆకలే!...లేచి కూర్చున్నాడు, పక్కస్టేషనులో రైలు ఆగగానే, దిగివెళ్ళి తినడానికి ఏమేనా తెచ్చుకోవాలని నిశ్చయంచేసుకున్నాడు. కూర్చుని సిగరెట్టు ముట్టించేసరికి... కాలం తిరిగి దొర్లడంప్రారంభించినట్లు అయింది. ఐదు, పది, పదిహేను...నిముషాలు పరుగెడుతున్నాయే కాని, స్టేషనూ రాలేదు, రైలూ ఆగలేదు. మరి తన ఆకలి? పక్కబెంచీమీద గాఢనిద్రలో వున్న తన సహచరుణ్ణి లేపడానికి ప్రయత్నించాడు.....కుదిపి, లేవదీసి కూర్చోపెట్టాడు.

"ఎందుకు?" శూన్యదృక్కులతో ప్రశ్నించాడు స్నేహితుడు.

"టైమెంతయింది?" అన్నాడు.

"బహుశా ఆగిపోయివుంటుంది!... అయినా హాయిగా నిద్దరపోక, ఎందుకొచ్చిన హడావిడి? ఎందుకు నన్ను లేపావు?" తిరిగి పక్కసర్దడం ప్రారంభించాడు స్నేహితుడు.

"ఆనేమిటి మళ్ళీ పడుకుంటావు? నాకు చచ్చేంత ఆకలివేస్తూంది."

"ఈ టైములో తిండానికేం దొరుకుతాయి? కడుపులో కాళ్ళుపెట్టుకుని పడుకో, తెల్లారాక చూసుకోవచ్చు" అంటూనే పడుకున్నాడు స్నేహితుడు.

"ఏదైనా సరే, నాకు తిండానికి కావాలి" గొణుక్కున్నాడు. ఏం చేస్తాడు? ఎదుటివాడి ఆకలి గుర్తించలేని మానవుణ్ణి?...గతిలేక యింకో సిగరెట్టు అంటించాడు అదికూడా అయిపోతే సిగరెట్టుపెట్టెకూడా తెచ్చుకోవాలి .. కొంచెం సేపటికి మామూలుగానే, అంతా స్థిమితపడింది. ఎంచేతో ఆకలికూడా తగ్గింది... జరిగిపోయిన సంవత్సరాలనిగురించీ, దండుగచేసిన నిముషాలను గురించీ, ఆలోచించినవిషయం కొంచం మరిచిపోసాగాడు...సిగరెట్టు కాల్చుకుంటూ కిటికీలోంచి పరుగెత్తే చెట్లనీ కొండలనీ చూస్తూంటే, ఆనందంగావుంది...అంతా బాగానేవుంది...ప్రపంచం అందంగానేవుంది...దానికేరోగంలేదు. ఎటొచ్చీ కొంచం కఠిన స్వభావం! అలాగే వుండాలి మరి! లేకుంటే ఎలాగ?... అది నిన్ను నాశనం చేస్తుంది...కాని ఎంత అమాయకంగా చేస్తుందని! ఎంత కారణరహితంగా చేస్తుందని!...తనకి తనకే తెలుసు...చచ్చివున్నానని! కాని ఎలాగ నమ్మడం? ఎలాగ నమ్మించడం? మళ్ళీ ముసుగుతీసి మాట్లాడ్డం ప్రారంభించింది. నిద్రలోంచి ఎవరో తట్టిలేపినట్లు అయింది... "ఏమిటి కాస్సేపు ప్రశాంతంగా వుండనివ్వదా ఏం?" అని విసుక్కున్నాడు. దాని దారిన అది మాట్లాడుకుపోయింది. వెధవ హృదయం-దానికీ మనిషిమీద జాలిలేదు! మధ్యమధ్య దాని ధోరణి అరికడదామనీ, దానితో వాదిద్దామనీ చూశాడు. "నీయిష్టం నువ్వేం వాగినా నాకేం ఫరవాలేదు. తెల్లవారితే కాశీ చేరుతాను" అన్నాడు.

"చేరతావులే! చేరక ఏమవుతావు?" హేళన చేసింది హృదయం. "కాశీ అంటే ఏమనుకుంటున్నావు? సర్వరోగనివారిణి లాంటిది! వ్యథిత హృదయాలకీ అలసిన శరీరాలకీ ఆరామం. తెలుసా?" అన్నాడు.

"ఎక్కడికెళ్ళినా, నీ హృదయం నీతోటే వుంటుందిగా? లేకుంటే కోతిలా మొసలిని మోసం చేయడానికి గట్టుమీద పెట్టినానంటావా?" వికటంగా నవ్వింది హృదయం.

"నువ్వు నోరుమూసుకుని వూరుకుందూ, నా బాధేదో నే పడతాను" అంటూ సీటుమీద యిందాకలాగే మేనువాల్చాడు...మళ్ళీ అదే నిశీధి సర్వత్రా ఆవరించుకుని కనిపించింది మళ్ళీ యిందాకా ఏఏ మూలలు వెతికాడో వాటి కోసమే మళ్ళీ వెతకడం ఆరంభించాడు.

అయినాకూడా హృదయం వాగుడు మానలేదు...ఈ ఖూనీ ఎప్పటికి ఆగుతుంది? హాయిగా తనని ఊపిరితీసుకోనివ్వదా ఏం?

ఒక్కసారి ఒళ్ళు విరుచుకుని బద్ధకం తీర్చుకున్నాడు. కళ్ళు ఒకసారి ఒత్తుకుని చూశాడు. నవ్వు వస్తూంది—దేన్ని చూసి? మానవుడి హాస్యాస్పదమైన జీవిత నాటకాన్ని చూసి-అందులోనూ, యీ మర్త్యుడు యీ అమరత్వంచెందినలోకంలో ఒక అమరని గొలుసు. పిచ్చివాడు దేనికి దానికే సరిపెట్టుకుందామనుకుంటాడు! కాని అన్నీ సమస్యలే అయి కూర్చుంటాయి. ప్రపంచం బ్రతికుండీ మానవత్వం లేనిది-మనిషి మానవత్వం వుంటూ జీవంలేనివాడు! ఆత్రం! అసహ్యంపుట్టించే వాటికంటె, ఆహ్లాదం కలిగించేవాటిని మాడడానికి తాపత్రయం! ప్రతిధ్వనించే రోదకంటే ప్రశాంతతని చేకుదామనే ఉబలాటం! ఈయుగయుగాలనీ వెలుగుతోటీ వాస్తవికానుభూతులతోటీ నింపేద్దామనే ఆసక్తి!...అన్నీ వుంటాయి. లాభంమాత్రం లేదు.

హృదయం ఎప్పుడు మాట్లాడ్డంమ్మానేసిందో, తనుమాత్రం నిశీధాకాశంలోకి ఏవో పారేసుకున్నట్లు వెతుకుతున్నాడు...."నీ యిష్టం వచ్చినట్లూ ఏడు! ఎవడిని ఉద్ధరిస్తావు?...ఊఁ, కానీ, నవ్వుకో, నిన్ను చూసి నువ్వే నవ్వుకో! అంతకంటె ఏంచెయ్యకలవు? ఇంకేముంది నీకు చెయ్యడానికి?" అనే హృదయపు సణుగుడు వినపడలేదతనికి...

రైలు సాగుతూనేవుంది-ఆకలివేస్తూనేవుంది. స్టేషనూ రాలేదు. రైలూ ఆగలేదు. కాల్చడానికి సిగరెట్టుకూడాలేదు సహచరుడు పక్కసీటుమీద గాఢనిద్రలో వున్నాడు. తెల్లారాలి. కాశీ చేరాలి. అక్కడమటుకు ఏముంటుందని? ఎక్కడికెళ్ళినా అమరత్వంలేని మానవుడూ, అమరత్వంగాంచిన లోకమూ వుండనే వుంటాయి. వాటన్నిటికీ పైగా జ్ఞాపకం తెచ్చుకోకూడదనుకునేవన్నీ జ్ఞప్తికి తెస్తూ ములుకర్రతో పొడిచే హృదయమూ వుండనే వుంటుంది! లేకుంటే...కథలో కోతివలె హృదయాన్ని రైల్లోవదిలి కాశీలో దిగుతాడేమో!

★